# ఇద్దరు పిల్లలు

చంద్రుణ్ణి కొనుక్కోనక్కర్లేదు. చుక్కల్ని కూడా కొనుక్కోనక్కర్లేదు.

అందుచేతనే చేతిని ఎత్తుకొన్న కొడుక్కి వాటిని చూపించి ఊరుకోబెడుతోంది ఆవిడ, సాయంకాలం ఆరున్నర గంటల పొద్దున్న, ఇంటిముంగిట్లో అంటే వీధిలో నిల్చొని.

ఉత్తర దక్షిణాలకి పోయే సందు 'పొడవుగా' ఉంది. అట్టే వెడల్పుగా మాత్రం లేదు. మ్యునిసిపల్ దీపాలు పేరుకి తగ్గట్టుగా వెలుగుతున్నాయి. తొట్టిగా ఉండే పెంకుటిళ్ళమీంచీ, తాటాకుల కప్పులమీంచీ, మురికి వీధిలోంచీ చలిగాలి మంద మందంగా వీస్తోంది. నడి రోడ్డుకి సూటిగా మీదకి నిల్చిన చంద్రుడు వంకరగా ఒరిగి చిరుమబ్బు పొక దాన్ని విదల్చుకొని బైటపడ్డాడు.

చలికి పైట దగ్గరగా కప్పుకొని, కుడిచేత్తో ఆకాశం వైపు చూపిస్తూ –

"అడుగో చందమామ! చూడమ్మా, చూడు" అంది ఆవిడ.

పిల్లడు తలెత్తి చూసి ఏడుపు ఆపేడు.

ఆ అబ్బాయి ఏడాదికంటె హెచ్చు వయసువాళ్ళా లేడు. ముక్కుబడి ఏదైనా ఉందేమో, జుట్టంతా అట్టలుకట్టి ఉంది. వంటిమీద బట్టలూ, వంట్లో జవసత్వాలూ లేవు. కొన ప్రాణాలు కళ్ళల్లో ఉన్నాయి.

ఆ పిల్లడికి "నిజంగా మూడేళ్ళున్నా" యంటే ఆ మాట నిజమేకాని నమ్మడానికి వీలుగా లేదు.

కొందరు జీవచ్ఛవాల్లా ఉంటారు. ఆ పిల్లడు అలానే ఉన్నాడు.

ఆ తల్లికూడా అలానే ఉంది.

"అవిగో చుక్కలు! చూసేవా ఎలా మెరుస్తున్నాయో" అంది ఆవిడ, చుక్కల్ని కూడా చూపిస్తూ.

చందమామని చేరదీసుకొందామనీ, చుక్కలకి చేరువగా చేరిపోదామనీ ఉండేది ఆవిడకి.

అది ఒకనాటి విషయం.

అదంతా గడిచిన దినాల సంగతి.

ఇప్పుడావిడ చందమామే కావాలందా? చుక్కల్ని తీసుకొచ్చి ఇస్తేనేగాని వీల్లేదందా?

అదేంలేదు.

చంద్రుడెలానూ దగ్గరగా రాడనీ, చుక్కలకి దగ్గరగా వెళ్ళడం ఎలానూ ఉండదనీ ఆవిడకి స్పష్టంగా తెలుసు.

తల ఎత్తి ఆకాశంలోకి చూసి నవ్విన పిల్లడు తలదించి తిరిగి ఏడవక తప్పదని కూడా ఆవిడకి తెలుసు.

ఆ కుర్రవాడు అదే రీతిగా చేసేడు మరో క్షణానికి.

ఏడుస్తూ యేదో మాటమాత్రం అస్పష్టంగా హీనంగా అంటున్నాడు.

"ఉండ్రా చచ్చినాడా! అన్నయ్య వెళ్ళిరావాలా? ఊరికే యేడుస్తే ఒస్తదా?" అని ఆవిడ కేకలు వేసింది.

ఆ "వచ్చేది" యేడుస్తే వస్తుందో రాదో ఆ కుర్రవాడికి తెలీదు. ఆ కుర్రవాడ్ని ఎలా సముదాయించటమో ఆవిడికి తెలీదు. తెలిసినా సముదాయించే ఓపిక లేదు. అందుచేత వాణ్ణొక్క మొత్తు మొత్తి ఇంట్లోకి తీసుకుపోయింది.

సరీగ్గా అదే సమయంలో ఆ తల్లి కొడుకే, ఏడేళ్ళ వాడు–నల్ల గోపాలం ఆ ఇంటికి కొంత దక్షిణంగా ఆ వీధిలోనే అమ్మవారి గుడి దగ్గర, వేపచెట్టుకింద నిల్చొని, ఆఖరిసారి అడిగినట్టుగా "అయితే, ఇవ్వవుకదరా" అని అడిగేడు.

గోపాలానికి ఎదురుగా నిల్చున్న కుర్రవాడు, అదే వయసువాడు–యెర్రసుబ్బడు–పోయేప్రాణాల్ని బిగించి పట్టుకున్నట్టుగా, చేతులు బిగించి గుండెలకి హత్తుకున్నాడు "బొంబాయి బస్సు"ని.

వేప చెట్టుకి యెదురుగా టెయిలర్ దుకాణంలోని లాంతరు వెలుగు వేపచెట్టు నీడలోనికి రాడానికి జంకుతోంది. వేపచెట్టు ఆకులు చలికాలానికి పల్చపడ్డాయేకాని చంద్రుణ్ణి మాత్రం అటకాయించేస్తున్నాయి. చెట్టుమొదల్లో బొమ్మవంటి గుళ్ళో నిశ్చలంగా నిల్చొన్న అమ్మవారి ముందు వెలిగే నూనె దీపపు వెలుగు ఆ ఇద్దరి పిల్లలకీ అందడంలేదు. గోపాలం నల్లటి నలుపనీ, కళ్లు మాత్రం పెద్దవనీ, నోరు చిన్నదనీ, ముక్కు ఎత్తనీ ఆ చీకట్లో చూస్తే తెలీదు. లాంతరు వెలుగులోకి లాక్కొచ్చి చూస్తే యెర్రసుబ్బడు రాగిచెంబు రంగులో ఉంటాడని, ముఖం సున్నాలా ఉంటుందనీ, కళ్లు చిన్నవనీ, నోరు పెద్దదనీ, ముక్కు యెర్ర జీడిపండులా ఉంటుందనీ తెలుస్తుంది. బాగా యెత్తుగా ఉన్న అంతటి చెట్టుకింద వాళ్ళిద్దరూ చాలా పొట్టిగా, పల్చగా, చిన్నగా, చిన్న కొయ్యబొమ్మల్లా మాత్రం కనిపిస్తున్నారు.

సందు ఆట్టే సందడిగా లేదు. ఉండీ ఉడిగీ ఒకడూ అరా చొప్పున మనుష్యులు నిశ్శబ్దంగా నడుచుకొని పోతున్నారు. పిల్లల్ని యెవ్వరూ గమనించినట్టుగా లేదు. గమనించినా వాళ్ళిద్దరి మధ్యా ఘర్షణ జరుగుతోందని తెలిసికొన్నట్టుగా లేదు. తలకి ముసుగు వేసుకొని, దగ్గుతూ దగ్గుతూ వచ్చిన ఓ ముసలాయన మాత్రం వాళ్ళకి దగ్గరగా వచ్చి ఆగి, పరీక్షగా "ఎవరబ్బాయి ల్నాయినా? సీకటడిపోయింది. పొండి యిళ్ళకిపొండి" అన్నాడు. వాళ్ళామాటలు విన్నట్టుగా లేదు. మరో మనిషి వచ్చేడని చూసినట్టుగానే లేదు. ముసలాయన దగ్గుకొంటూ వెళ్ళి చంకనున్న గోనెవిప్పి అమ్మవారి గుడిపక్క చప్టామీద పరుచుకొని కీళ్లు నొవ్వకుండా నెమ్మదిగా జాగ్రత్తగా పడుకున్నాడు. బొంబాయి బస్సులనేవి ఉంటాయని ముసలాయనకి తెలీదు.

* * *

చంద్రుణ్ణీ చుక్కల్నీ కొనుక్కోనక్కరలేదు. బొంబాయి బస్సుల్ని మాత్రం కొనుక్కోవాలి.

అయితే ఆ బొంబాయి బస్సు యెర్రసుబ్బడికి కొనకుండానే వచ్చింది. మొన్నీ మధ్య సుబ్బడి బావ-అప్ప పెనిమిటి-బొంబాయి నుండి బండీదిగేడు. దిగి ఇంటో అడుగుపెడుతూనే, పెట్టెతెరిచి పైకితీసి బహూకరించేడు. మరదలికొక 'సాటిన్ ఫ్రాకూ, బావమరది కొక 'బొంబాయి బస్సూ'ను.

బొమ్మనీ, బొమ్మని తెచ్చిన బావనీ, బావని పెళ్ళాడిన అప్పనీ చూసుకొని బ్రహ్మానందభరితుడైన యెర్రసుబ్బడు యింటో అటూఇటూ యెగిరెగిరి యెగిరెగిరి తరువాత ఒక్కదూకు దూకేడు నల్లగోపాలం ఇంటికి.

ఎదటింటి యెండు వెంకడుగాడు, పక్కింటిదుక్క బుజ్జాయిగాడు, వెనకింటి దొండబాబిగాడు, నూతిపక్కింట్లో నూనె జడ్డుగాడు, జామి చెట్టింట్లో జామకాల సీత-వీళ్లంతా సుబ్బడి స్నేహితులే. కాని ఆ బొమ్మని వాళ్ళెవరికీ చూపించకుండా, సూటిగా, రామబాణంలా ఆ నల్లగోపాలం ఇంటికే యెర్రసుబ్బడు ముందుగా పరిగెత్తడానికి కారణం?

వాళ్ళిద్దరూ ప్రాణస్నేహితులని ఆ వీధిలో అందరికీ తెలుసు. సుబ్బడి తండ్రికీ, గోపాలం తండ్రికీ ఒకే "మర"లో నౌఖిరీ. ఆ తండ్రులిద్దరూ మర్లోకి తాగడానికీకూడా కలిసే వెళ్తూంటారు. వాళ్ళయిళ్లు కొంచెం దూరదూరంగా ఉన్నా ఒకే వీధిలో ఉన్నాయి. వారి భార్యలు అప్పు సప్పులకి ఒకరిళ్ళ కొకరు వెళ్ళినప్పుడు ఒకరిదెబ్బ లొకరికి చూపించుకోడం వారికి మామూలు.

గోపాలానిదీ సుబ్బడిదీ ఇంచుమించు ఒకే వయసు. వాళ్ళిద్దరిదీ ఒకేస్కూల్లో ఒకే క్లాసు. క్లాసుకి ఎప్పుడూ ఆలస్యంగా వెళ్ళేది వాళ్ళిద్దరే. ఒకటో యెక్కం, రెండో యెక్కం, పదో యెక్కం తప్పించి మరే ఒక్క యెక్కంకూడ రానివాళ్ళు ఆ క్లాసుకి

వాళ్లిద్దరే.

పెద్దలైనా, పిన్నలైనా ఇటువంటి పరిస్థితుల్లో స్నేహితులవక తప్పరు.

కాని, ఓ రామయ్యగారికి జామిచెట్టే లేకపోయినట్లయితే వాళ్ళిద్దరూ ప్రాణ స్నేహితులవక పోయేవారేమో.

స్కూలుకి దగ్గర్లో రామయ్యగారి యిల్లుంది. ఇంటిపక్క రామయ్యగారి జామిచెట్టుంది. జామిచెట్టమీద రామయ్యగారి పంచప్రాణాలూ ఉంటాయి.

కలకల్లాడుతూ కల్పవృక్షంలా కనిపించే జామిచెట్టునిండా నవనవలాడుతూ పళ్ళు యెన్నోపళ్లు ఉన్నప్పటికీ, బడిపిల్లలకి అదొక వెల్ కమ్ అడ్రస్‌లా ఉన్నప్పటికీ, ఏ ఒక్క బడిపిల్లడూకూడా ఆ పళ్ళనిచూసి ఆనందించడం తప్ప తిని ఆనందించపోడానికి రెండు కారణా లున్నాయి.

ఒకటిః రామయ్యగారి తోటమాలీ యమకింకరుళ్ళా ఉండడం.

రెండుః రామయ్యగారు కాలయముళ్ళా ఉండడం.

నల్లిగోపాలం మాత్రం చూసిచూసి ఓ రోజున ధైర్యం చేసేసేడు.

దిగువని ఎర్రసుబ్బడు రాలేపళ్ళని జోరుజోరుగా ఏరుతున్నాడు. పైనుంచి నల్లిగోపాలం పళ్ళని తెంపి పారేస్తున్నాడు. ఇద్దరూకూడా యముడూ, కింకరుడూ యింట్లోంచి వెళ్లడమే చూసేరుకాని రావడం గమనించలేదు. వాళ్ళు మాత్రం వస్తూనే చూసింది వీళ్ళనే. వస్తూనే చెరొకణ్ణీ పట్టుకొని చావగొట్టి చెవులు మూసేరు. ఆ దినం రామయ్యగారికీ రావణాసురుడికీ తేడా తొమ్మిదితలల్లో మాత్రమే.

కాలయముడు; కల్పవృక్షం; చావుదెబ్బలు.

నల్లిగోపాలం, ఎర్రసుబ్బడూ ప్రాణస్నేహితు లవడానికి అవీ కారణాలు. అవి మాత్రం సిమెంటు కాంక్రీటువంటి కారణాలు.

ఈ స్నేహితులకి-

బటానీలు, పకోడీలు, ఉసిరికాయలు, రేగుపళ్లు, వేరు శెనగలు, గాలిపడగలు, పలకపుల్లలు, రబ్బర్లు, తెల్లికాయితాలు, బొంగరాలు, గొట్టికాయలు వగైరాలు-అన్నీ కూడా వారి సమిష్టి ఆస్తులు. అవి ఒకరికి ఉన్నట్లయితే రెండోవారిక్కూడా ఉన్నట్లే లెక్క.

బొమ్మ బస్సుని చూసినప్పుడుకూడా సుబ్బ డెంత సంతోషించేడో గోపాలం అంతగానూ సంతోషించేడు.

చాలా చిన్నది బొంబాయి బస్సు. ఎర్రటి రంగుతో మెరుస్తూంది. అంత చిన్న బొమ్మలోనూ రెండు అంతస్తులు కనిపించేలా తయారు చేసేరు. డ్రైవరు టిన్ డ్రైవరు. కిటికీల దగ్గర ప్రయాణీకులూ, గుమ్మందగ్గర కండక్టరూ మాత్రం రంగు రేకుమీద

రంగుబొమ్మలు. "కీ" ఇస్తే బస్సు పరుగెడుతుంది.

"బలే బలే బలేగుందిరా" అన్నాడు నల్లగోపాలం.

కాని సుబ్బిడి వ్యవహారం బలేగా ఉందా?

దీనికి "కీ" ఇలా యివ్వాలి, కుడివైపుకి తిప్పాలి. వెనక చక్రాలు గిర్‌గిర్‌మని తిరక్కుండా యిలా పట్టుకోవాలి,

అని ఆ బొమ్మకి "కీ" ఎలా యివ్వడమో చూపించేడు సుబ్బిడు.

ఇలా ఒదలాలి.

బస్సుని ఒదిలేడు.

జరజర శబ్దంచేస్తూ వెళ్ళి గోడని గుద్దేసి ఆగిపోయింది బస్సు.

"అడ్డేదీ లేపోతే చాల్దూరం వెళుతుంది తెల్సా!" అన్నాడు సుబ్బిడు.

బస్సుని గోడకి యివతలవైపుకి మళ్ళీ తిప్పి వదిలేడు.

జరజరా మళ్లీ పరిగెత్తింది బస్సు. చివరికి ఆగింది.

దాన్ని చేతిలోకి తీసుకొని చెపుతున్నాడు సుబ్బిడు.

"చూసేవా, ముందు కూర్చున్నాడు డ్రైవరు. మా బావ అలాగే కూర్చుంటాడు. మరో తమాషారా, గోపాలం! ఇది మేడబస్సు. మావూళ్ళో యిటువంటి దేదీ చూపించు చూదాం! బొంబాయిలో అన్నీ యిలాటి బస్సులే. బొంబాయి మా బావతో నేనూ వెళ్తాన్ తెల్సా!"

ఆ మాటలు చెప్పడంలో, చెపుతూన్నప్పుడు ఆ కళ్ళు తిప్పడంలో, ఆ బొమ్మని చేత్తో గట్టిగా పట్టుకోడంలో, "కీ" ఇచ్చి దాన్ని పరిగెత్తించినప్పుడు గోపాలం ఎక్కడ లాక్కుంటాడో అనీ తనే ముందుపరిగెత్తి దాన్నితీసి గుండెలకి అదుముకోవడంలో మచ్చు కొక్కసారైనా దాని గోపాలం చేతికి యివ్వకపోవడంలో-

సుబ్బిడి ఉత్సాహమే కాకుండా, "ఇది నాది. దీన్ని నేనే వాడాలి" అనేభావంకూడా వ్యక్తమవుతోంది. కొద్ది సేపట్లో గోపాలానిక్కూడా అంతా స్పష్టమయింది.

"ఈ బొమ్మ వీడు నా కివ్వడు-"

అని చాలా ఖచ్చితంగా, రెండు రెళ్ళు నాలుగులాగ, సూర్యుడు ఉదయించి అస్తమించుట్లాగ తెలిసింది గోపాలానికి.

"నేనోసారి 'కీ ఇస్తానిలా యివ్వరా" అని అడిగీసేడు.

అప్పుడు సుబ్బిడు బస్సుకి 'కీ' యివ్వబోతున్నాడు. ఇవ్వబోతూ ఆగేడు.

ఇస్తాడా యివ్వడా? ఇవ్వడా యిస్తాడా? ఇస్తాడా యివ్వడా?...

"కీ" ఇవ్వడం మొదలు పెట్టేడు సుబ్బడు.

"మాబావా...('కీ'తిప్పేడు)...మరీ...(మళ్ళీతిప్పేడు)...మా బావవొచ్చి మరీ-(మరోసారి తిప్పేడు)...కొప్పడతాడ్రా..."

అని యింకా యేదో నసిగేడు సుబ్బడు, కరకరమని 'కీ' యిచ్చేస్తూ సాకులు చెపుతున్నాడు సుబ్బడు!

గోపాలానికి అసహ్యం వేసింది.

"పోన్లేరా ఒద్దులే" అనేశాడు.

గోపాలం ఉత్సాహం అంతా చచ్చిందంటే అర్థం వుంది. కాని సుబ్బడి హుషారంతాకూడా యెందుకు సన్నగిలింది? ఏదో తప్పు చేసినట్టు యెందుకు సిగ్గేసింది? మరో అయిదునిమిషాలైనా ఉండలేకపోయేడు అక్కడ. తిరిగి యింటికి మెల్లిగా బయల్దేరేడు.

బయల్దేరబోయేడు.

ఇంతలో యెదురుగా గోపాలం తమ్ముణ్ణి యెత్తుకొని గోపాలం తల్లి వచ్చింది.

గోపాలం తమ్ముడు అందరికీ తమ్ముడే.

బొంబాయి బస్సుని చూడగానే తమ్ముడు-నిజంగా చాలా కాలానికి-నవ్వేడు.

"ఏఁవిరా సుబ్బడూ, ఏమిట్రా ఆ చేతిలోదీ?" అని అడిగింది 'తమ్ముడి' తల్లి.

ఎడంగా నిల్చొన్న నల్లిగోపాలం నిశ్శబ్దంగా నిల్చొని తీక్షణంగా చూస్తున్నాడు.

"బస్సు! బొంబాయి బస్సు!" అన్నాడు సుబ్బడు, తలవంచుకొని చేతిలో బొమ్మవైపుచూస్తూ.

బావ రావడం, బొమ్మ తేవడం మొదలైన విషయాలన్నీ నెమ్మదిగా ఒకటీ ఒకటీ తెలుసుకొంది గోపాలం తల్లి.

తమ్ముడు ఈలోపున "బచ్చు బచ్చు" అంటూ చెయ్యి జాస్తూనే ఉన్నాడు.

చూస్తున్నాడు గోపాలం. గోపాలం చూస్తున్నాడు.

తనకయితే యివ్వలేదు. తమ్ముడికైనా యిస్తాడా యివ్వడా?

తమ్ముడికేగాని యివ్వకపోతే సుబ్బడితో ఆ క్షణంలోనే జట్టు విప్పేసి తీరుతాడు గోపాలం.

సుబ్బడుకూడా చూస్తున్నాడు. వేగిరం ఉడాయించేద్దామని చూస్తున్నాడు కాని కాలు కదలడంలేదు. చప్పుడు ఆమడ దూరానికి వినబడేలా గుండెలు కొట్లాడుతున్నాయి.

తమ్ముడు "బచ్చు బచ్చు" అని అంటూనే ఉన్నాడు.

ఎత్తుకున్న పిల్లణ్ణి నేలని కూర్చోబెడుతూ "ఏదీ ఆ బొమ్మ వీడికోసారి ఇద్దూ" అంది గోపాలం వాళ్ళ అమ్మ.

అప్పటి మట్టుకు బొమ్మని యివ్వక తప్పింది కాదు. ఆవిడక్కూడా యేదో సాకుచెప్పే సాహసం లేకపోయింది సుబ్బడికి.

కాని మర్నాడు మాత్రం 'గోపాలం వాళ్ళ' ఇంటికి వెళ్ళడం మానేశాడు. తరువాత రోజు ఆ తరువాత రోజుకూడా అంతే చేశాడు. స్కూలుకి గోపాలం కంటె ముందుగా వెళ్తున్నాడు. క్లాసులో గోపాలానికి ఎడంగా కూర్చుంటున్నాడు. స్కూలునుంచి తిరిగి రావడంలో గోపాలాన్ని తప్పించుకొందికి వీలులేకపోతోంది. గోపాలంతో నడుస్తున్నడు మాత్రం నిశ్శబ్దంగా నడుస్తున్నాడు. రెండోరోజు సాయంకాలం కొంత దూరం యింటివైపు నడిచేక, జేబులోంచి బటానీలు తీసి "తీసుకోరా" అన్నాడు గోపాలం.

ఎలా ఊహించగలిగేడోగాని సుబ్బడు ఆ బటానీలు పుచ్చుకోడని మాత్రం ఊహించగలిగేడు గోపాలం.

"నా కొద్దురా" అన్నాడు సుబ్బడు.

సుబ్బడు యెందుకొద్దన్నాడో గోపాలానికి తెలుసు.

బటానీలు పుచ్చుకొంటే బస్సు ఎక్కడ ఇవ్వవలసి వస్తుందోనని సుబ్బడి భయం.

"ఎవడిక్కావాలీ వీడి బస్సు!" అనుకొన్నాడు గోపాలం.

అయితే,

సుబ్బడి బస్సూ అంటే అక్కర్లేదుకాని, అటువంటి బస్సు కావాలనే ఉంది గోపాలానికి. కావాలని ఉన్నప్పటికీ తనకోసం అయితే ఇంట్లో అంత గోల చెయ్యకపోను.

కాని తమ్ముడిక్కావాలి ఆ బస్సు.

అందుచేతనంటే అందుచేతనే అటువంటి బొమ్మకోసం యింట్లో తెగగోల చేసేడు. గోలచేస్తే నాన్న తిట్టేడు; అమ్మకొట్టింది. అమ్మ తిట్టింది; నాన్న కొట్టేడు.

ఆ సంగతి సుబ్బడికి ఎక్కడ తెలిసిపోతుందోననే భయం కలగడంచేత గోల చెయ్యడం ఆపుచేసేడు గోపాలం.

కాని, తమ్ముడిక్కావాలి ఆ బొమ్మ. మాటి మాటికీ "బచ్చు బచ్చు" అంటూనే ఉన్నాడు.

తమ్ముడికేదో జబ్బు ఉందని గోపాలానికి తెలుసు. అందరి పిల్లలూ నవ్వుతారు. తమ్ముడు మాత్రం నవ్వడు. కాని మొన్న ఆ బొమ్మ చూసినప్పుడు నవ్వేడే! అయితే తమ్ముడి జబ్బు పోతుంది కాబోలు. బొమ్మ యిస్తేపోతుంది. సుబ్బడు యివ్వడు. ఇంట్లో నాన్న కొనడు.

గోపాలం తర్కం, గోపాలం బాధాకూడా ఎవ్వరికీ తెలీదు.

తమ్ముడు మాత్రం తెలివి ఉన్నప్పుడల్లా "బచ్చు బచ్చు" అంటూనే ఉన్నాడు.

చివరికి వాళ్ళమ్మకి విసుగెత్తి ఆ రోజు సాయంకాలం, "ఒరే గోపాలం, ఆ సుబ్బణ్ణడిగి ఆ 'బచ్చుట బచ్చు' దాన్నో సారి పట్రారా" అంది.

అభిమానాన్నీ పౌరుషాన్నీ చంపుకొని, తమ్ముడి కోసం ఆ సుబ్బడి దగ్గరికి వెళ్దామనుకొనే నిశ్చయానికి అంతకు ముందే వచ్చేడు గోపాలం. ఎందుకోగాని నిశ్చయాన్ని కార్యరూపంలో పెట్టలేకపోతున్నాడు.

అమ్మ ఆజ్ఞ ఆఖరికి గోపాలాన్ని ముందుకు తోసింది.

గోపాలం రావడం సుబ్బడు చూసుకోలేదు. చూసి ఉన్నట్లయితే బొమ్మని ప్రత్యేకం యింట్లో యెక్కడో దాచకపోయినా, చేతిలో మాత్రం ఉంచుకోకపోను. దురదృష్టవశాత్తూ సుబ్బడి చేతిలో బొమ్మ ఉండగా వచ్చీసేడు గోపాలం.

వస్తూనే అడగవలసిందేదో అడిగీసేడు గోపాలం.

"తమ్ముడు యేడుస్తున్నాడు. ఒక్కసారి బొంబాయి బస్సుని మా అమ్మ యిమ్మందిరా" అన్నాడు తనమాట సుబ్బడు నమ్మడేమోనని.

"కావాలిస్తే మా అమ్మనొచ్చి అడుగు" అని కలిపేడు.

గోపాలం అకస్మాత్తుగా వచ్చి అలా చెప్పడంవల్ల యేమాలోచించడానికీ సుబ్బడికి అవకాశం లేకపోయింది. అందుచేత యింటిదగ్గర్నుంచి బొమ్మ పట్టుకొని, వేపచెట్టు వరకూ కిమ్మనకుండా వచ్చేడు. అక్కడికి వచ్చే లోపున ఏదో ఒక నిశ్చయానికి వచ్చినట్టుగా టక్కున ఆగేడు.

ఆగి "రేపు తెస్తానని చెప్పరా" అన్నాడు.

* * *

అందుకే ఆఖరిసారి అడిగినట్టుగా మళ్ళీ అడిగేడు గోపాలం.

"అయితే యివ్వవు కదరా" అన్నాడు.

వేపచెట్టు బరువుగా ఊగింది. గాలికి యెండుటాకులు గలగల్లాడుతూ దొర్లేయి. దర్జీ దుకాణంలో కుట్టుమిషీను గర గర లాడింది. దుకాణంలోకూర్చొని కాజాలు కుట్టే పదిహేనేళ్ళ కుర్రవాడు యేది ఉండో, ఏది లేకో, యెవరి కోసమో, ఎందుకో పడే బాధనంతా కంఠంలోకి తెచ్చుకొని పాటతో పోగొట్టుకొంటున్నాడు. చప్టామీద పడుకున్న ముసలాయన మధ్యమధ్య దగ్గడం మర్చిపోతున్నాడు.

జవాబు చెప్పకుండా నిల్చున్నాడు సుబ్బడు.

గోపాలం కోపంతో బాధతో వణికిపోతున్నాడని సుబ్బడికి తెలియడంలేదు.

సుబ్బడు గుక్కిళ్ళు మింగుతున్నాడు. బొమ్మని ఇవ్వాలనీ ఉంది. ఇవ్వడానికి ఇష్టంలేకుండా ఉంది.

"తమ్ముడు యేడుస్తున్నాడు...అమ్మ అడగమంది...లేపోతే ఎవడిక్కావాలి ...నీ వెధవబస్సు" అని మాటలు విరుస్తూ అన్నాడు గోపాలం.

ఎర్రసుబ్బడు ఎర్రబడ్డం చీకట్లో స్పష్టంగా తెలియడంలేదు. ముఖం అమ్మవారి గుడివైపు తిప్పుకున్నాడు. గుళ్లో నూనెదీపం అతని కళ్ళల్లో రెండుగా చీలింది.

"రేపు నే తెస్తారా...మా బావా, మరొచ్చి మా అక్కా రేపెళ్ళిపోతార్రా...అప్పుడు నే పట్టుకొస్తా కదూ" అన్నాడు సుబ్బడు.

బొమ్మను యివ్వడానికీ, బావా అక్కా వెళ్ళిపోడానికీ గల సంబంధం గోపాలానికి అర్థం కాలేదు. కోపంతో పళ్ళు బిగించి ఊపిరి త్వరత్వరగా తీస్తూ విడుస్తూ, ముత్యం మూడోసారిగా మళ్ళీ అడిగేడు.

నూనెదీపం కదుల్తోంది. సుబ్బడి గుండెలు త్వరితంగా కొట్టుకుంటున్నాయి. సుబ్బడు తటపటాయిస్తూ నిల్చున్నాడు. సెకెన్లు నడిచిపోతున్నాయనీ, నల్లగోపాలం అగ్గిసెగలా దహించుకుపోతున్నాడనీ తెలుసుకోకుండా ఉన్నాడు.

చివరికి తటాల్న నూనెదీపం నుంచి దృష్టి యిటువైపు మరల్చి "ఇందరా" అన్నాడు.

దుకాణంలో పడుచువాడు పాట ముగించేడు. కుట్టుమెషీను గరగరలాడ్డం మొదలు పెట్టింది. ముసలాయన దగ్గి దగ్గి "హమ్మయ్యా" అని అయాసం తీర్చుకున్నాడు. గాలియెండుటాకులు గలగలల్డాతూ చెదిరిచెదిరిపోయేయి.

"ఇందరా" అని సుబ్బడు అన్నాడే కాని పుచ్చుకోడానికి గోపాలం అక్కడలేడు. ఏ నాడో వెళ్ళిపోయేడు.

మర్నాడు-

ఉదయం ఆలస్యంగా లేచేడు సుబ్బడు. అందుచేతనో మరెందుచేతనో గోపాలం వాళ్ళ యింటికి ఉదయం వెళ్ళలేదు. తిన్నగా స్కూలుకే వెళ్ళిపోయేడు. వెళ్ళేసరికి బాగా ఆలస్యం అయింది. క్లాసులో అటూయిటూ పచారు చేస్తూన్న 'మాష్టారు' సుబ్బణ్ణి చూసి ఆగి,

"ఏరా, సుబ్బారావూ ఏడ్రా నీ నేస్తం?" అని అడిగేడు.

సుబ్బడికి తెలీదు.

"కలిసి రావడం మానీసేరేంరా?"

సుబ్బడు చెప్పలేదు.

"దెబ్బలాడుకున్నారుట్రా?"

"లేదండి."

అనేశాడేకాని సుబ్బడి మనసు పీకుతోంది.

ఆరోజు గోపాలం బడికి రానేలేదు.

సాయంకాలం అయిదున్నర గంటలకి చేత్తో బొంబాయి బస్సు పట్టుకొని వేపచెట్టు దాటేడు సుబ్బడు. ఏదో నేరం చేసిన వాడి ముఖంలా ముఖం అంతా వాడింది. బరువుగా పడుతోంది అడుగు.

గోపాలం యింటిముందు, పెంటకుప్ప పక్క నిల్చొని ముగ్గురు పిల్లలు వీధిలోంచి యింటోకి తొంగి తొంగి చూస్తున్నారు. ఇద్దరివి, యెర్రగళ్ళ లాల్చీలు; ఖాకీ నిక్కర్లు. ఒకడికి నిక్కరే ఉందికాని చొక్కా లేదు. ముగ్గురి చేతుల్లోనూ తాళ్ళూ బొంగరాలూ వున్నాయి. వాళ్ళకి ఆ యింట్లోకి వెల్ళాలనీ వున్నట్టుగా వుంది. కాని ఎందుకో భయపడుతూన్నట్టుగా వున్నారు. వాళ్ళ చూపులూ, వాళ్ళ గుస గుసలూ, మొత్తంమీద వాళ్ళ ప్రవర్తనా చూస్తే సుబ్బడికి యెందుకో గాని భయం కలిగింది. గుండెలు బరువెక్కేయి. జోరుగా నడుద్దామనుకుంటే అడుగు మాత్రం తేలిగ్గా పడ్డంలేదు.చేతిలో వున్న బొంబాయి బస్సు నెత్తిమీద కొండలా వుంది.

"ఏంరా, గోపాలం లేడూ" అని కొంచెం బెక్కుతూ అడిగేడు వెళ్తూనే.

ముగ్గురు పిల్లలూ గుడ్లు పెద్దవి చేసేరు.

వాళ్ళల్ళో చొక్కా లేనివాడు దొంగ బాచిగాడు"ఇష్! నీకు తెల్దుట్రా?" అని సాశ్చర్యంగా అన్నాడు. ప్రమాదకరమైనది, ముఖ్యమైనది, ఆ సమయానికి యెంతో గొప్పదైన వార్త చెప్పబోయే ఆతృత కనిపిస్తోంది బాచిగాడి ముఖంలో.

ముగ్గురు పిల్లలూ స్వరాలు బాగా తగ్గించి, మాటల్ని జోరుగా దొర్లించి సంగతి యేమిటో వివరంగా చెప్పేరు. చెప్పేక.

"అర్రె నువ్వెళ్ళకరా బాబూ! ఎవురూ యెళ్ళకూడదట. మావోళ్లు చెప్పేరు." అని ఒక యెర్రగళ్ళ చొక్కావాడు గొంతుక తగ్గించి గోలపెట్టాడు.

ఆ మాటలు సుబ్బడికి వినిపించనేలేదు. తొందరగా గుమ్మంలోంచి రెండు మెట్లు దిగి ముందు గదిలోకి వెళ్ళేడు.

గదిలో ఓ వారకి గోడకి ఓ పాత సైకిలు చేరవేసి వుంది. దానికి యివతలగా, ఒక తడిసి యెండిన చాపమీద తలకింద చెయ్యి పెట్టుకొని ఒక పక్కకి తిరిగి పడుక్కొంది గోపాలం తల్లి. తడిసి ఆరని జుట్టంతా ఆమె వంటిమీదా చాపమీదా పడుతోంది. శుష్కించిపోయిన ఓ ముసలావిడా, మోటుగా వున్న ఒక నడివయసు ఆడమనిషీ ఆమె తల దగ్గర కూర్చొని నెమ్మదిగ యేదో మాట్లాడుతున్నారు.

గుమ్మంలోంచే గదంతా కలయజూసి తిన్నగా వెనక గదిలోకి వెళ్ళేడు సుబ్బడు.

వెనక గదికి కిటికీల్లేవు. గదినిండా నీడలు పడగలు విప్పుకొనివున్నాయి. చీకట్లో అడవిలాగ సామానంతా అస్పష్టంగా కనిపిస్తోంది. ఎడమవైపుకి యెత్తుగా భూతంలా నిల్చొంది పందిరి మంచం.

నీడల్లో మునిగిపోయేడు సుబ్బడు.

కొద్దిసేపట్లో, ముందుగదిలో కూర్చొన్న ముసలావిడా "అయ్యో, పిల్లడు ఏడుస్తున్నాడమ్మా" అంది.

ఎక్కడో యేదో లోకంలో పాతుకుపోయినట్టుగా వున్న గోపాలం తల్లి మెల్లిగా కదిలి లేవబోతుంటే, "నువ్వుండమ్మా! నే వెళ్ళి సముదాయిస్తా" అని శుష్కించిపోయిన ఆ ముసలావిడే గుమ్మందాటి వెనకగదిలోకి వెళ్ళింది.

పందిరి మంచానికి పక్కగా, నేలమీద కూర్చుని, ఓ మేకుతో గచ్చుని బద్దల్చేస్తున్నాడు గోపాలం. వంచిన తల పాములబుట్టలా ఉంది. అడుగుపెదవి కోరకింద నొక్కుకుపోతోంది.

ఎదురుగా నిల్చున్నాడు ఎఱ్ఱ సుబ్బడు.

కొన్ని వస్తువులు మనుషుల్ని వేరుచేస్తాయి. కొన్ని పరిస్థితులు మనుషుల్ని దగ్గరగా తీసుకొస్తాయి.

ఒకప్పుడు నలుపు నిగనిగ మెరుస్తుంది. ఒకప్పుడు ఎండ చల్లగా ఉంటుంది. "నిన్ను అంటం అంటం" అనేటి నక్షత్రాలే ఒకప్పుడు జారి కిందికి దిగి భూమిని అందుకొంటాయి.

ఎఱ్ఱసుబ్బడు చెప్పేమాటలు గదిలోకి వచ్చిన ముసలా విడకి సరిగా అర్థంకాలేదు. కాని, గోపాలానికి స్పష్టంగా వినిపిస్తున్నాయి, తెలుస్తున్నాయి.

గోపాలాన్ని బొంబాయిబస్సు తీసుకోమంటున్నాడు ఎఱ్ఱసుబ్బడు.

"అచ్చంగా, అచ్చంగా తీసుకోరా! నాకొద్దురా ఇదీ" అంటూ చెయ్యిజాచి యిస్తున్నాడు బొంబాయి బస్సుని.

గోపాలం కన్నెత్తలేదు, తల ఎత్తలేదు.

సుబ్బడికి అక్కర్లేదట ఆ బస్సు.

గోపాలానిక్కూడా అక్కరలేదు.

కావాలన్నది తమ్ముడు.

కావాలన్న తమ్ముడు ఏడీ? ఏడీ?

బొంబాయి బస్సు అక్కరలేదు; సుబ్బడి సానుభూతీ అక్కరలేదు గోపాలానికి.

సుబ్బడికి అర్థం అవుతోంది గోపాలానికి యెందుకంత కోపంగా వుందో.

అందుకే -

"మనవాడు కాదే. అల్లవాళ్ళ యెఱ్రసుబ్బడు యేడుస్తున్నాడు."

అనవలసివచ్చింది ముందుగదిలో చాపదగ్గర తిరిగి కూర్చున్న ముసలావిడ.

ఆంధ్రపత్రిక వీక్లీ, 7-4-1954